జిల్లాలో పశుగ్రాసం కొరత లేదు

అందుబాటులో 79 వేల మెట్రిక్ టన్నుల వరిగడ్డి

పశుసంవర్ధకశాఖ జెడి డాక్టర్ జి.నెహ్రూబాబు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో పశుగ్రాసం కొరత లేదని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.నెహ్రూబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది 79 వేల మెట్రిక్ టన్నుల వరిగడ్డి అందుబాటులో ఉందని పేర్కొన్నారు. దీంతోపాటు రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు 2,612 మెట్రిక్ టన్నుల సమీకృత దాణాను సబ్సిడీ ద్వారా అందజేశామని తెలిపారు. మరో 165 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలను సబ్సిడీ ద్వారా రైతులకు సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. ఈ దృష్ట్యా జిల్లాలో పశుగ్రాసం కొరత లేదని ఆయన తెలిపారు.

చెరువుల జాతర..!

కొల్లేరులో అక్రమ చేపల చెరువుల తవ్వకాలకు రంగం సిద్ధం

ఏడు వేల ఎకరాల్లో చెరువులు తవ్వాలని ప్రణాళికలు

కొల్లేరుతో మిళితమైన నాలుగు నియోజకవర్గాల్లో అమలు

కొన్నిచోట్ల తవ్వకాలు ప్రారంభం.. జనాల్లో అలజడితో వెనక్కి

వారం రోజుల్లో మళ్లీ తవ్వకాలకు కసరత్తు

నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే అంతా

'జీ.. హుజూర్' అంటూ సలాం కొడుతున్న ఫారెస్ట్ అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరులో నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువుల తవ్వకాలకు రంగం సిద్ధమైందా... ప్రతి గ్రామంలోనూ వంద ఎకరాల్లో చేపల చెరువులు తవ్వేందుకు ప్రణాళికలు తయారయ్యాయా.. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధి కనుసన్నల్లో ఇదంతా సాగుతుందా.. అంటే అవుననే సమాధానం వస్తోంది. కొల్లేరుతో మిళితమైన నాలుగు నియోజకవర్గాల్లోనూ మొత్తంగా ఏడు వేల ఎకరాల్లో చేపల చెరువుల తవ్వకాలకు ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. ఇటీవల కొన్నిచోట్ల తవ్వకాలు ప్రారంభించినా మీడియాలో కథనాలు రావడంతో తాత్కాలికంగా వెనక్కితగ్గారు. ఇదంతా ఫారెస్ట్ అధికారుల కనుసన్నల్లోనే సాగుతుండటం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. వారం రోజుల్లో తవ్వకాలు ప్రారంభించి ముందుకు సాగేందుకు రెడీ అవుతున్నట్లు సమాచారం.

కొల్లేరు అభయారణ్యం మళ్లీ అన్యాక్రాంతమవుతున్న పరిస్థితి నెలకొంది. కాంటూరుతో సంబంధం లేకుండా బడాబాబులంతా ఏకమై కొల్లేరులో చేపల చెరువుల తవ్వకాలకు సిద్ధమయ్యారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతున్న పరిస్థితి ఉంది. కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధి కనుసన్నల్లో చేపల చెరువుల తవ్వకాల వ్యవహారం సాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. జిల్లాల విభజన జరిగిన తర్వాత కొల్లేరుతో మిళితమైన కైకలూరు, ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు నియోజకవర్గాలు ఏలూరు జిల్లాలోకి చేరాయి. గడిచిన కొంతకాలంగా నిడమర్రు, దెందులూరు, ఏలూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో అక్రమంగా చేపల చెరువుల తవ్వకాలు సాగుతూనే ఉన్నాయి. ఇప్పుడు ఏకంగా బరితెగించినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది కొల్లేరును మొత్తం ఒకేసారిగా చేపల చెరువులుగా మార్చేందుకు నాలుగు నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులంతా కలిసి మాస్టర్‌ప్లాన్ రూపొందించినట్లు ప్రచారం సాగుతోంది. కైకలూరు, మండవల్లిలో 18 గ్రామాలు వరకూ ఉండగా ప్రతి గ్రామంలోనూ వందెకరాల్లో చేపల చెరువులు తవ్వేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. మిగిలిన మండలాల్లోనూ ఇదేవిధంగా కొనసాగించాలని వ్యూహాలు రచించినట్లు చెబుతున్నారు. ఇప్పటికే ప్రత్తికోళ్లలంకలో 262 ఎకరాలను చేపల చెరువులుగా మార్చేసినట్లు చెబుతున్న పరిస్థితి ఉంది. ఈ విధంగా కొల్లేరుతో మిళితమైన నాలుగు నియోజకవర్గాల్లోనూ ఏడు వేలకుపైగా ఎకరాలను చేపల చెరువులుగా మార్చాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. దీనికోసం పెద్దఎత్తున డబ్బు వెదజల్లుతున్నట్లు సమాచారం. ఫారెస్ట్ అధికారులకు పెద్దఎత్తున మామూళ్లు అందించినట్లు చెబుతున్నారు. కొల్లేరును కంటికి రెప్పలా కాపాడాల్సిన ఫారెస్ట్ అధికారులే అక్రమార్కులతో చేతులు కలిపి ధ్వంసం చేస్తున్న పరిస్థితి ఉంది. రాష్ట్రస్థాయిలో చక్రం తిప్పడంతో జిల్లాలోని అధికారులు మౌనం వహించి కొల్లేరులో చేపల చెరువుల తవ్వకాలను పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఈ చేపల చెరువుల తవ్వకాలతో కొల్లేరు మొత్తం మరోసారి పెద్దఎత్తున ఆక్రమణలకు గురికానుంది.

తాత్కాలిక విరామమే.. ముందుంది చెరువుల జాతర

కొల్లేరులో చేపల చెరువుల తవ్వకాలను కొద్దిరోజుల క్రితం ప్రారంభించారు. కైకలూరు మండలం పందిరిపల్లి, నిడమర్రు మండలంలో ఈ తవ్వకాలు సాగాయి. మీడియాలో కథనాలు రావడంతో తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు తెలుస్తోంది. అంతా సద్దుమణిగిన తర్వాత వారం రోజుల్లో మళ్లీ చేపల చెరువుల తవ్వకాలు ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే వారం, పది రోజుల్లో కొల్లేరులో చేపల చెరువుల తవ్వకాలు జాతరను తలపించేలా సాగనున్నాయి. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో జిరాయతీ భూముల్లో చెరువులను సైతం అప్పటి ప్రభుత్వం ధ్వంసం చేసింది. దాదాపు పది వేల ఎకరాల జిరాయతీ భూమిని రైతులు కోల్పోయినట్లు అంచనా వేశారు. భూసర్వే నిర్వహించి జిరాయతీ భూములను రైతులకు అప్పగించాలని ఎప్పటి నుంచో అంతా కోరుతున్నారు. ఆ ప్రక్రియ పూర్తి చేయకుండా బడాబాబులు అక్రమంగా చేపడుతున్న చేపల చెరువుల తవ్వకాలతో అక్కడి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుండటంతో అధికారులు పూర్తిగా చేతులెత్తేసిన పరిస్థితి నెలకొంది. కొల్లేరులో అక్రమ చేపల చెరువుల తవ్వకాలను అడ్డుకుంటారా.. లేక చేతులెత్తేశారో చూడాల్సి ఉంది.

వ్యవసాయాభివృద్ధికి అండ అభినందనీయం

హెచ్‌డిఎఫ్‌సి రుణమేళాలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

కృష్ణా, గోదావరి బేసిన్ రైతులు, మహిళలకు పిఎంఇజిపి, పిఎంఎఫ్‌ఎంఇ కింద రూ.2 వేల కోట్ల రుణాలు

ప్రజాశక్తి - ఏలూరు

కృష్ణా-గోదావరి ప్రాంతంలోని చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ప్రాధాన్యతా రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి అండగా నిలుస్తున్న హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ అధికారులను కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అభినందించారు. స్థానిక మినీ బైపాస్‌లోని క్రాంతి కళ్యాణ మండపంలో మంగళవారం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఆధ్వర్యంలో పిఎంఎఫ్‌ఎంఇ, పిఎంఇజిపి, ఎఫ్‌పిఒలకు చెందిన ఎస్‌హెచ్‌జి మహిళలకు, రైతులకు జీవనోపాధి యూనిట్ల స్థాపనకు నిర్వహించిన రుణమేళాను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు గ్రూప్ హెడ్ సిఆర్‌బి.రాహూల్ శ్యామ్ శుక్లా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఎంఎఫ్‌ఎంఇ, పిఎంఇజిపి పథకాల కింద పలు రైతు ఉత్పత్తి సంస్థలు, జెఎల్‌జి, ఎస్‌హెచ్‌జి మహిళలకు రూ.రెండు వేల కోట్ల రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ సాధారణంగా ప్రభుత్వరంగ బ్యాంకులు ఎక్కువగా ప్రాధాన్యతా రంగాలకు రుణ పరపతి కల్పిస్తుంటాయని, అయితే హెచ్‌డిఎఫ్‌సి వంటి ప్రయివేట్ బ్యాంకు పెద్దఎత్తున ప్రాధాన్యతా రంగానికి అత్యధిక రుణాల మంజూరుకు ప్రాధాన్యతివ్వడం శుభపరిణామమన్నారు. కృష్ణా-గోదావరి నదుల అనుసంధానంతో అత్యధికంగా వ్యవసాయం, ఆక్వా ఎగుమతులు, ఆయిల్‌పామ్‌తో అత్యధిక ప్రాధాన్యతారంగం ఉన్న జిల్లాలో ఇటువంటి పెద్ద రుణమేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. హెచ్‌డిఎఫ్‌సి ద్వారా అందిస్తున్న రుణాలను రైతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్, ప్రధానమంత్రి ఉపాధికల్పన పథకం, రైతు ఉత్పత్తి సంస్థలకు చెందిన ఎస్‌హెచ్‌జి మహిళలకు, రైతులకు పెద్దఎత్తున రుణాలందించడం అభినందనీయమన్నారు. జిల్లాలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ద్వారా 700 యూనిట్లకు సంబంధించి రూ.నాలుగు కోట్ల రుణాలు అందిస్తున్నారన్నారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు గ్రూప్ హెడ్ సిఆర్‌బి.రాహుల్‌శ్యామ్ శుక్లా మాట్లాడుతూ కృష్ణా-గోదావరి ప్రాంత ఆర్థికాభివద్ధికి తోడ్పడేందుకు తమ బ్యాంకు కట్టుబడి ఉందన్నారు. చిన్న రైతులు, చిన్న వ్యాపారులు, దుకాణాదారులకు బ్యాంకింగ్ సేవలు విస్తృతం చేసేందుకు గ్రామీణ శ్రేయస్సుకు దోహదపడే దిశగా తమ బ్యాంకు ఒక అడుగు ముందుకు వేస్తుందన్నారు. గత మార్చి 31 నాటికి తమ బ్యాంకు 7821 శాఖలు, 19,727 ఎటిఎంలు కలిగి ఉందన్నారు. అదనంగా 15,921 మంది వ్యాపార కరస్పాండెంట్లు కలిగి ఉందన్నారు. సుమారు 15 వేల మందికి రుణపరపతి కల్పించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. త్వరలో మరో అతి పెద్ద రుణమేళాను నిర్వహిస్తామని ప్రకటించారు. తొలుత జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు గ్రూప్ హెడ్ సందర్శించారు. కార్యక్రమంలో నాబార్డ్ డిడిఎం అనిల్‌కాంత్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, పశుసంవర్ధకశాఖ జెడి డాక్టర్ జి.నెహ్రూబాబు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు అధికారులు సుమన్, వెంకటేశ్వరరావు, దినేష్, శంకర్, సంజయ్ పాల్గొన్నారు.

26న ఇఎస్‌ఐ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

ఇఎస్‌ఐ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, ఇఎస్‌ఐ పథకాన్ని బలోపేతం చేయాలని ఈ నెల 26న ఏలూరులోని ఇఎస్‌ఐ డిస్పెన్సరీ వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సమావేశం విజ్ఞప్తి చేసింది. ఇఎస్‌ఐ చందాదారులైన కార్మికులకు మెరుగైన ఆసుపత్రి సేవలు, మందులు, పెన్షన్లు, సిక్ వేతనాలు, నిరుద్యోగ భృతి తదితర సౌకర్యాల కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సమావేశం విమర్శించింది. కార్మికుల ఇఎస్‌ఐ సొమ్ము లక్షా 20 వేల కోట్లు రిజర్వ్ నిధులు ఉన్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు విమర్శించారు. ఏలూరులో మంగళవారం జరిగిన సిఐటియు జిల్లా కమిటీ సమావేశానికి లింగరాజు అధ్యక్షత వహించారు. సమావేశ వివరాలను జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ పత్రికలకు తెలిపారు. ఈ నెల 27న ఏలూరులో ఉద్యోగులు నిర్వహించే ప్రాంతీయ సదస్సును సిఐటియు జిల్లా కమిటీ సమావేశం బలపరుస్తుందని ప్రసాద్ తెలిపారు. అన్ని జిల్లాల్లో ఇఎస్‌ఐ కనీసం 30 పడకల ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని కోరారు. ఇఎస్‌ఐ ఆస్పత్రుల్లో ఆధునిక పరికరాలు, డాక్టర్లు, సిబ్బంది, మందుల పంపిణీ మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. ఇఎస్‌ఐ ఆసుపత్రులకు చెల్లించాల్సిన బిల్లులు రావడం లేదని, రెఫరల్ ఆసుపత్రులు రోగులను చేర్చుకోవడం లేదని తెలిపారు. కార్మికులు సొంతంగా డబ్బు పెట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరు, విజయవాడ, తిరుపతిలో ప్రభుత్వం నిర్మిస్తామన్న 500 పడకల ఇఎస్‌ఐ ఆస్పత్రులు వెంటనే నిర్మించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న ఏలూరులోని ఇఎస్‌ఐ డిస్పెన్సరీ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని, ఈ నెల 30న సిఐటియు ఆవిర్భావ దినోత్సవం జిల్లాలో ఘనంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

జగనన్న ఇళ్ల స్థలాల పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరులోని జగనన్న ఇళ్ల స్థలాలను నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ మంగళవారం పరిశీలించారు. పలువివరాలను మండల రెవెన్యూ అధికారులను అడిగితెలుసుకున్నారు. లబ్ధిదారుల ఇళ్లు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఏరియా ఆసుపత్రిని నిర్మించాలి

జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రద్దయిన వైద్యుల పోస్టులను, బెడ్స్‌ను పునరుద్ధరించాలని అఖిలపక్షం డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులో ఏరియా ఆసుపత్రిని వెంటనే ఏర్పాటు చేయాలని, జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రద్దయిన వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులను, బెడ్స్‌ను పునరుద్ధరించాలని అఖిలపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, జనసేన, ఆమ్‌ఆద్మీ తదితర పార్టీల నాయకులు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు, ప్రభుత్వ బోధనా ఆసుపత్రిలో (మెడికల్ కాలేజీ) రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి పళ్లెం కిషోర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, సిపిఐ నగర కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర నాయకులు బద్ద వెంకట్రావు, జనసేన నగరాధ్యక్షులు నగిరెడ్డి కాశీనరేష్, ఆమ్‌ఆద్మీ ఏలూరు కన్వీనర్ షేక్ మస్తాన్ మాట్లాడుతూ ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రి (మెడికల్ కాలేజీ) పేరుతో జిల్లా ప్రభుత్వాసుపత్రి వైద్య సేవలు నిలిపివేయడం అన్యాయమన్నారు. దానివల్ల 42 మంది స్పెషలిస్టు వైద్యులు, 150 మందికిపైగా వైద్య సిబ్బంది, 350 బెడ్స్ రోగులకు అందుబాటులో లేకుండా పోయాయన్నారు. దీంతో ప్రతిరోజూ జిల్లా నలుమూలల నుండి ఏలూరు వస్తున్న పేదలకు సత్వర వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అన్ని మండలాల ప్రజలు ఏలూరు జిల్లా ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం వస్తుంటారని తెలిపారు. ఒక్క ఏలూరు జనాభానే 3.50 లక్షలకు పైబడి ఉందని, ఈ నేపథ్యంలో ఏలూరులో ఒక ద్వితీయశ్రేణి ఆసుపత్రి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దీనికి జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ఖాళీగా ఉన్న బ్లాక్‌లను కేటాయించవచ్చునని తెలిపారు. ఏలూరు మెడికల్ కాలేజీ పూర్తి కావాలంటే మూడు నుండి ఐదు సంవత్సరాల సమయం పడుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ఏలూరులో ఒక ఏరియా ఆసుపత్రిని కనీసం 200 బెడ్స్‌తో తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీలో అన్ని విభాగాలకు పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని, ఆసుపత్రిలో అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, ఆ రోజే రిపోర్టు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం అఖిలపక్ష పార్టీ నాయకుల బృందం కలెక్టరేట్‌కు చేరుకుని డిఆర్‌ఒకు వినతిపత్రం సమర్పించారు. దీనిపై కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని పేదల ఆరోగ్య అవసరాల రీత్యా ఏలూరు ఏరియా ఆసుపత్రిని వెంటనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బి.ప్రసాద్, టి.శ్రీను, ఎస్.బాలు, కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, పి.బాబుప్రసాద్, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.



రోగులను పరామర్శిస్తున్న అఖిలపక్ష పార్టీల నేతలు

ఎస్‌ఐ లేరు..కేసులు కట్టం..!

నిడమర్రు పోలీస్‌స్టేషన్‌లో దారుణ పరిస్థితులు

నాలుగు నెలలుగా ఎస్‌ఐ పోస్టు ఖాళీ

రైటర్ తీరుపై ఆరోపణల వెల్లువ

బేరసారాలతో కేసులు రాజీ..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నిడమర్రు మండల పోలీస్ స్టేషన్‌కు ఎస్‌ఐను నియమించకపోవడంతో రైటర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంత పెద్ద సమస్యతో బాధితులు వెళ్లినా ఎస్‌ఐ లేరు.. కేసు కట్టడం కుదరదంటూ హెడ్‌కానిస్టేబుల్, రైటర్‌గా వ్యవహరిస్తున్న అధికారి చెప్పడంతో బాధితులకు ఏం చేయాలో తెలియడం లేదు. వివిధ సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న బాధితులకు సమాధానం చెప్పేవారు లేకుండా పోయారు. ఫలితంగా బాదితులకు న్యాయం జరగడం లేదు. ఇక్కడి పోలీస్ స్టేషన్ తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐను జనవరి 22వ తేదీన బదిలీచేశారు. నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ ఈ స్టేషన్‌కు ఎస్‌ఐ నియామకం జరగలేదు. దీంతో స్టేషన్‌లో కీలకపాత్ర పోషిస్తున్న కిందిస్థాయి సిబ్బంది వ్యవహారం జనాల్లో హాట్‌టాఫిక్‌గా మారింది. ఇటీవల మండలంలోని ఒక గ్రామంలో కోడిపందాలు ఆడుతున్న వారినుంచి కొన్నిబైక్‌లు తెచ్చి పెద్దఎత్తున సొమ్ములు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక గ్రామంలో రికార్డింగ్ డ్యాన్సులు జరుగుతున్నప్పటికీ నిరోధించకుండా సంబంధిత నిర్వాహకులతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు సమాచారం. మద్యం వంటివి పట్టుబడిన కేసులు పెట్టకుండా వారితో బేరసారాలు కుదుర్చుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఓ మహిళ తన సమస్యపై ఫిర్యాదు చేస్తే 15 రోజులు దాటినా కేసు కట్టకుండా కాలయాపన చేయడంతో ఎస్‌పి కార్యాలయంలో నిర్వహించే స్పందనలో ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోలీస్‌స్టేసన్‌కు వస్తున్న ఫిర్యాదులపై కేసులు పెట్టకుండా తమకు అనుకూలంగా మార్చుకుని వసూళ్ల పర్వం సాగిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నాలుగునెలల్లో పోలీస్‌స్టేషన్‌లో రైటర్ తీరుపై మండలంలోని జనం విసిగిపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నిడమర్రు పోలీస్‌స్టేషన్‌కు ఎస్‌ఐను నియమించడంతోపాటు, బాధితులకు న్యాయం చేయాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

సమస్యలన్నీ పరిష్కరించే వరకూ పోరు

27న ఏలూరులో కృష్ణా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలస్థాయి సదస్సు

ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమ సమస్యలు పరిష్కరించాలని గత ఫిబ్రవరిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఇచ్చిన లేఖలోని సమస్యలన్నీ పరిష్కరించే వరకూ పోరాటం సాగిస్తామని ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. తమ పోరాటం ఫలితంగా ప్రభుత్వం కొన్ని సమస్యలు పరిష్కరించిందని, మిగిలిన సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. తమ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈ నెల 27న ఏలూరులోని టొబాకో మర్చంట్స్ కళ్యాణ మండపంలో నిర్వహించే ప్రాంతీయ సదస్సు జయప్రదానికి మంగళవారం ఆయా సంఘాల నేతలతో స్థానిక రెవెన్యూ భవనంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ గత 73 రోజులుగా చేపట్టిన ఆందోళనా కార్యక్రమాల ఫలితంగా ప్రభుత్వం స్పందించి కొన్ని సమస్యలు పరిష్కరించిందన్నారు. అయితే తాము ప్రస్తావించిన సమస్యలన్నీ పరిష్కరిస్తేనే ఉద్యమ కార్యాచరణ ఆపుతామని స్పష్టం చేశారు. ప్రధానంగా బకాయిపడ్డ నాలుగు డిఎలు, పిఆర్‌సి ఎరియర్స్, పేస్కేల్స్, స్పెషల్ పేలు, విఆర్‌ఎలకు డిఎ, ఉద్యోగోన్నతి పొందిన గ్రేడ్-2 విఆర్‌ఒలకు పేస్కేల్ ఇవ్వడం, విలీనానికి ముందు ఆర్‌టిసిలో పని చేస్తున్న ఉద్యోగులకు పాత సర్వీస్ రూల్స్ వర్తింపజేయడం, హోంగార్డులను ఇతర యూనిఫాం సర్వీస్ శాఖల్లో విలీనం చేయడం, మిగిలిపోయిన తొమ్మిది వందల భాషా పండితుల కోసం సూపర్ న్యూమరరీ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సర్వీస్ రూల్స్ సమస్యలు, వర్క్‌చార్జ్‌డ్ ఉద్యోగుల పేరు ఇంజినీర్ సబార్డినేట్‌గా మార్పు 010 పద్దు కింద జీతాలు, డిఆర్‌డిఎ ఉద్యోగులను పిఆర్‌అండ్ ఆర్‌డి శాఖలో విలీనం, మున్సిపల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, రూరల్ వాటర్ సప్లయి డిపార్టుమెంట్‌లోని ఇంజినీర్లకు డిఇ పోస్టులు మంజూరు తదితర ముఖ్యాంశాలు అన్నింటిపై స్పష్టమైన లిఖితపూర్వక ఉత్తర్వులు వస్తే తప్ప ఈ ఉద్యమం ఆగేది లేదన్నారు. నాలుగు సంవత్సరాలుగా ఈ ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించినప్పటికీ ఉద్యోగులను ప్రభుత్వం పూర్తిగా విస్మరించినందున, తప్పని పరిస్థితుల్లో ఆందోళన చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ ఎంప్లాయీస్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణమోహన్, క్లాస్ ఫోర్ ఎంప్లాయీస్ అధ్యక్షులు మల్లేశ్వరరావు, ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కార్యదర్శి బి.జ్యోతి, ఎపి విఆర్‌ఒ సంఘం రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, డిపిఒ సంఘ రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్, ఎపి జెఎసి అమరావతి ఏలూరు జిల్లా చైర్మన్ కె.రమేష్‌కుమార్, కార్యదర్శి ఎ.ప్రమోద్ కుమార్, ట్రేడ్ యూనియన్స్ నాయకులు బండి వెంకటేశ్వరరావు, కృష్ణమాచార్యులు, బి.సోమయ్య, సచివాలయ ఉద్యోగుల నాయకులు హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న జెఎసి నేతలు

నారాయణపురం విద్యార్థులకు స్టేట్ బ్రిలియంట్ అవార్డులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

జగనన్న ఆణిముత్యాలు-2023 స్టేట్ బ్రిలియంట్ అవార్డుకు నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారు. ఈ నెల 25న జరిగే అవార్డుల ప్రదానోత్సవంలో నారాయణపురం కళాశాల విద్యార్థులు పున్నవి, సుధారాణి (సిఇసి) జిల్లా, అసెంబ్లీ స్థాయికి ఎంపికయ్యారు. నియోజకవర్గస్థాయిలో కొరపాటి కార్తీక్ (హెచ్‌ఇసి), కురిటి హేమలత (ఎంపిసి) ఎంపికయ్యారని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బివి.శ్రీనివాస్ తెలిపారు. జిల్లాస్థాయి అవార్డు గ్రహీతకు రూ.50 వేలు, నియోజకవర్గస్థాయి అవార్డు గ్రహీతకు రూ.15 వేలు నగదు, ప్రశంసాపత్రం అందించనున్నారు.



అవార్డుకు ఎంపికైన విద్యార్థులు వీరే..

విద్యుత్ సమస్యపై టిడిపి నిరసనలు

ఛార్జీలు తగ్గించాలని, అనధికార కరెంట్ కోతలు అరికట్టాలని డిమాండ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, కోతల్లేకుండా కరెంట్ సరఫరా చేయాలని టిడిపి నేతలు స్థానిక డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఆపరేషన్ విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్‌చంద్రశేషు మాట్లాడుతూ రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్ అందిస్తామని, ఛార్జీలను పూర్తిగా తగ్గించేస్తామని, ఒక పైసా కూడా ధర పెంచబోమని ఎన్నికల సమయంలో చెప్పిన సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎనిమిదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెరిగాయని విమర్శించారు. పార్టీ మండల అధ్యక్షులు సాయల సత్యనారాయణ మాట్లాడుతూ లో వోల్టేజీ, అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరారు. పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ మాట్లాడుతూ ఒకపక్క ప్రజలు మరొక పక్క రైతాంగం విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పట్టణాల్లో విద్యుత్ కోతల వల్ల చిరు వ్యాపారులు ఉపాధిని కోల్పోతున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. ఆనంతరం అప్రకటిత విద్యుత్ కోతలు, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ డిఇ కె.అంబేద్కర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి పాతూరి అంబేద్కర్, మండల, పట్టణ ప్రధాన కార్యదర్శులు కుక్కల మాధవరావు, తూటికుంట రాము, కౌన్సిలర్ నంబూరి రామచంద్ర రాజు, ఇస్మాయిల్, శ్రీను, ఆలపాటి రాము, ఘంటా రామారావు, రామకృష్ణ, రామకృష్ణ పాల్గొన్నారు.

ముసునూరు: అనధికార విద్యుత్ కోతలు తగ్గించాలని కోరుతూ టిడిపి మండల అధ్యక్షులు దేవినేని ధలరామ్ ఆధ్వర్యంలో ముసునూరు సబ్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ కోతలతో పలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని, పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్న సమయంలో విద్యుత్ కోతలు విధించడం దారుణమన్నారు. టిడిపి మండల ఉపాధ్య క్షులు కొల్లి గంగారామ్ మాట్లాడుతూ మండువేసవిలో విద్యుత్ కోతలతో వృద్ధులు, చంటి పిల్లలు ఎండ వేడిమిని తట్టుకోలేక అల్లాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సూర్యదేవర నాగమంజుల, శ్రీనివాసరావు, సర్పంచులు కొండేటి విజయలక్ష్మి బాబీ, జి.సుహాసనిమోహనరావు, మందలపు ధర్మరాజు, వేంపాటి సత్యనారాయణ, సురేంద్ర, రాపర్ల బాలకృష్ణ, రాపర్ల ప్రతాప్ పాల్గొన్నారు.

టి.నరసాపురం: వ్యవసాయానికి అంతరాయం లేకుండా విద్యుత్ ఇవ్వాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో మంగళవారం టి.నరసాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా టి.నరసాపురం - కామవరపుకోట రహదారిపై రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఎల్ఐ ఎఎస్‌ఎస్.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, అప్రకటిత విద్యుత్ కోతలు ఆపాలని, మోటార్లకు మీటర్లు బిగించడాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్, ఆచంట అనిల్ కుమార్, కొండపల్లి రవి, బొంతు సత్యనారాయణ, పెద్దిన సత్యనారాయణ, అగ్నిపర్తి భిక్షమయ్య, దాసరి చంద్రశేఖర్, కొల్లి రమేష్, మాధవరావు, వెంకట్రావు, పెండ్యాల ప్రసాద్, దేవరపల్లి రంగారావు, పేరం రాంబాబు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : విద్యుత్ ఛార్జీల పెంపును, అనధికార విద్యుత్ కోతలను నిరసిస్తూ నూజివీడు విద్యుత్ శాఖ ఇఇ కార్యాలయం టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజవర్గ పరిశీలకులు బొడ్డు వేణుగోపాల్‌రావు, మండల అధ్యక్షులు ముసునూరు రాజా, నజివీడు పట్టణ అధ్యక్షులు మలిశెట్టి జగదీష్, నియోజవర్గ తెలుగు రైతు అధ్యక్షులు వెంకటరెడ్డి, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు అరికోటి సంగీతరావు, బిసి సెల్ నాయకులు తలపంటి రాజశేఖర్ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : పెరిగిన కరెంట్ ఛార్జీలు, విద్యుత్ కోతలను నిరసిస్తూ మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద ప్రధాన రహదారిపై టిడిపి నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేత బొరగం శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ పాలనలో ప్రజలపై భారాలు పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మొగపర్తి సొంబాబు, ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు, ఏలూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలవరం : విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, అప్రకటిత కరెంట్ కోతలు నివారించాలని టిడిపి మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ కోరారు. ఈ సందర్భంగా పోలవరం సబ్ స్టేషన్ వద్ద అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు బొడ్డు కష్ణ, అసెంబ్లీ రైతు కమిటీ కార్యదర్శి పాదం ప్రసాద్, సీనియర్ నాయకులు జల్లేపల్లి నరసింహ రావు, సీనియర్ నాయకులు పైలా అబ్బులు, బిసి సెల్ నాయకులు మాగంటి రాము, పార్లమెంటు ఐటిడిపి అధికార ప్రతినిధి జల్లేపల్లి శేష వెంకట జితేంద్ర పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో ధర్నా చేస్తున్న టిడిపి నేతలు

లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం వైఎస్ఆర్ కాలనీ ఎ-బ్లాకులో విద్యుత్ లో ఓల్టేజీ సమస్య ఎట్టకేలకు పరిష్కారం కానుంది. ఈ కాలనీ 2009లో ఏర్పడింది. అప్పటి నిధుల అభ్యర్థన మేరకు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా, బిగించి కేబుల్ వైరు ద్వారా విద్యుత్ సరఫరా చేశారు. 14 ఏళ్ల కాలంలో కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పెరిగాయి. సుమారు 295 గృహాల్లో 2500 మంది నివసిస్తున్నారు. ఇలాంటి కాలనీలో తరచూ విద్యుత్ పోవడం, సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోవడం, వినియోగదారులు తీవ్రఅవస్థలు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో ఈ సమస్యల పరిష్కారం కోసం నారాయణపురం ఎఐ శ్రీరామ్ ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపారు. వారి నుంచి అనుమతులు సాధించేలా ఎఇ కృషి చేసి 100కెవి ట్రాన్స్‌ఫార్మర్లు (డిటిఆర్‌లు)-2, ఫైవ్‌వైర్లు (మూడు ఫేజ్‌లు, ఒక న్యూట్రల్, ఒక ఎస్‌టిఎల్) బిగించేందుకు అనుమతులు మంజూరు చేయించారు. సంబంధిత మెటీరియల్ రెండు మూడు రోజుల్లో నారాయణపురం సబ్ స్టేషన్‌కు వస్తుందని ఎఇ వెల్లడించారు.



పోలవరంలో అవగాహన ర్యాలీ

ప్లాస్టిక్ నిర్మూలన బాధ్యత అందరిదీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్లాస్టిక్ కవర్ల నిర్మూలనకు సమాజంలో ప్రతిఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సహకార సంఘం సొసైటీ అధ్యక్షులు వందనపు వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో ప్లాస్టిక్ రహిత గ్లాసులు, ప్లేట్లు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వందనపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లకు బదులుగా పీసుతో తయారు చేసిన కవర్లు, స్టీలు, పేపర్ గ్లాసులు, ప్లేట్లు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి బి.వి.రత్నాజీ, ఆశా వర్కర్లు, సొసైటీ సిబ్బంది అనంద్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత

పోలవరం: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె.బాలారావు అన్నారు. మంగళవారం లైఫ్ కార్యక్రమంలో భాగంగా పోలవరంలో ప్లాస్టిక్ రహిత సమాజంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పలువోట్ల ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారి బి.మధుకరన్, బీట్ ఆఫీసర్లు బి.రమేష్, కె.సత్యనారాయణ, కె.వెంకటస్వామి, వైల్డ్ లైఫ్ బేస్ క్యాంప్ సుధీర్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం అందించాలి

ప్రజాశక్తి - పోలవరం

కొత్త పట్టిసీమ అగ్ని ప్రమాద బాధిత రైతులకు తక్షణం సహాయం అందించాలని జనసేన నియోజకవర్గ కన్వీనర్ చిర్రి బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కొత్తపట్టిసీమలో అగ్ని ప్రమాద బాధిత రైతులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో 24 మంది రైతులకు చెందిన 16 వరి కుప్పలు అగ్నికి ఆహుతయ్యాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారని, అగ్ని ప్రమాదం జరిగి రోజులు గడుస్తున్నా రైతులకు పరిహారం అందించడంలో వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని హితవుపలికారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి బాధిత రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం మాటలు ప్రభుత్వమే గాని చేతల ప్రభుత్వం కాదని విమర్శించారు. మండల కేంద్రానికి ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై తహశీల్దార్ బి.సుమతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు గునపర్తి చిన్ని, రాము పాల్గొన్నారు.

వేంపాడు అగ్రహారం భూ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -నూజివీడు రూరల్

గొల్లపల్లి పంచాయతీ పరిధిలోని వేంపాడు అగ్రహారం భూముల సమస్యల పరిష్కారంలో దేవాదాయ శాఖ అధికారుల దౌర్జన్యాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతుందని, దీన్ని ఖచ్చితంగా ప్రతిఘటిస్తామని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతు సంఘం సుదీర్ఘ పోరాటం వల్ల 2003లో రైతులకు పట్టాలిచ్చేందుకు అప్పటి ప్రభుత్వం 430 జిఒను విడుదల చేసిందన్నారు. ఫీల్డ్ సర్వే పొజిషన్ సర్వే పూర్తయినప్పటికీ దేవాదాయ శాఖ ఎండ్యూమెంట్స్‌లో ఆ జిఒను సస్పెండ్ చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 1971లో సుప్రీంకోర్టు వేంపాడు అగ్రహారాన్ని ఎస్టేట్ వివిధీగా తీర్పు ఇచ్చిందన్నారు. 1990లో సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును సమర్థిస్తూ 1600 ఎకరాల్లోని 207 మంది రైతుల నుండి ఆలయ నిర్వహణ కోసం భరణం చెల్లించాలని ఆర్డర్ ఇచ్చిందని ఆయన తెలిపారు. అలాంటి ఎండోమెంట్ అధికారులు సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పులను పక్కనాలి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండోమెంట్ అధికారుల చర్యల వల్ల రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారన్నారు. భూ సమస్య పరిష్కరించే వరకూ రైతు సంఘం పోరాడుతుందన్నారు.

మద్ది ఒక్కరోజు ఆదాయం రూ1.55 లక్షలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి మంగళవారం ఒక్కరోజు రూ1,55,746 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.కొండలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయానికి యాత్రికులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ క్రమంలో సుమారు వెయ్యిమందికి అన్నదానం చేశారు. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, సిబ్బంది సేవలు అందించారని ఇఒ తెలిపారు.

అలరించిన రోటరీ నృత్య పోటీలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రోటరీ యువజనోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీమల్లాది సీతారామలింగేశ్వరరావు రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన శాస్త్రీయ, ఆధునిక నృత్యపోటీలు ఉత్సాహంగా సాగాయి. మంగళవారం సాయంత్రం రోటరీ కార్యదర్శి పూడా రాంగోపాల్(గోపీ) ఆధ్వర్యంలో తడికమళ్ల నవీన్ ప్రత్యేక పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్ఆర్.కృష్ణబాబు, అమరావతి నాట్యాలయ వ్యవస్థాపకులు కె.ప్రశాంత్‌కుమార్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఏడేళ్ల నుంచి 15 ఏళ్లలోపు చిన్నారులకు వేసవిలో రోటరీ వినోదం విజ్ఞానం పంచతూ చేపట్టిన యువజనోత్సవాల్లో చిన్నారులు పాల్గొని కనబరిచిన ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రోటరీ ఎలక్ట్ ప్రెసిడెంట్ రొంగల దేవీప్రసాద్, ధనకుమార్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

విద్యుదాఘాతంతో పశువుల పాక దగ్ధం

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యుదాఘాతంతో పశువులపాక దగ్ధమైన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బొర్రంపాలెం గ్రామానికి చెందిన రాజుకు చెందిన పశువుల పాకపై విద్యుత్ వైర్లు గాలికి ఒకదానికొకటి కలుసుకుని మంటలు వ్యాపించాయి. దీంతో పాకకు మంటలు అంటుకున్నాయి. దీంతో స్థానికులు అప్రమత్తమై పశువులను బయటకు తీసుకురావడంతో పెనుప్రమాదం తప్పింది. విద్యుత్ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు.

ప్రజాశక్తి
ప్రతి కుటుంబం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

లక్ష్యం ఘనం.. ఆచరణ శూన్యం..!

నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

సేకరించిన చెత్తను తగలబెట్టేస్తున్న వైనం

ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు

షోకాజ్ నోటీసులు జారీ చేసినా మారని అధికారుల తీరు

సంపద తయారీ కేంద్రం వద్ద తగలబెడుతున్న చెత్త

ప్రజాశక్తి - మండవల్లి

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారుతున్నాయి. ఎంతో ఆర్భాటంగా, మహోన్నత లక్ష్యంతో ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. కానీ ఆచరణలో మాత్రం లక్ష్యం నెరవేరడం లేదు. లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ కేంద్రాలు నేడు అధ్వానంగా, నిరుపయోగంగా తయారయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాలను కించిత్తయినా అధికారులు బేఖాతరు చేస్తూ సేకరించిన చెత్తను తగలబెట్టేస్తున్నారు. దీంతో సంపద తయారీకి ఉపయోగపడాల్సిన చెత్త అగ్నికి ఆహుతి అవుతూ వాయు కాలుష్యానికి కారణమవుతుంది. ముఖ్యంగా మండల కేంద్రమైన మండవల్లిలో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా మారింది.

మండవల్లిలో చెత్త నుండి సంపద తయారు చేసేందుకు సుమారు ఏడు లక్షల రూపాయలతో కేంద్రాన్ని నిర్మించారు. గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తను సంపద కేంద్రానికి తరలించడంలో పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వహించడంతో జాతీయ రహదారిపైన, గ్రామంలో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు పెరిగిపోయాయి. దుర్వాసన వెదజల్లడంతోపాటు దోమలు వ్యాప్తిచెందుతున్నాయి. చెత్తను తరలించేందుకు పంచాయతీ కార్మికులు, వాహనం కూడా అందుబాటులో ఉన్నప్పటికీ చెత్తను సంపద కేంద్రానికి తరలించకుండా రోడ్లపైనే తగులబెట్టేస్తున్నారు. దీనివల్ల పొగచుట్టుముట్టి జాతీయ రహదారిపై ప్రయాణించడానికి దారి కనపడక వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలపై ప్రజాశక్తిలో పలు కథనాలు సైతం ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన జిల్లా అధికారి మల్లికార్జునరావు మండవల్లి చేరుకుని పరిశీలించి కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్త ఉన్నది సంపద తయారు చేయడానికేనని తగలబెట్టేందుకు కాదని హెచ్చరిస్తూ కార్యదర్శి తోట శ్రీనివాసరావుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారంరోజుల్లో సంపద తయారీ కేంద్రాన్ని అమల్లోకి తీసుకురావాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ నాయకుల అండదండలు పంచాయతీ అధికారికి ఉండటంతో ఉన్నతాధికారుల ఆదేశాలను, హెచ్చరికలను తృణప్రాయంగా పక్కనపెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రోడ్లపైన తగలబెట్టడం తప్పేమోనని ఆలోచించి చెత్తను సంపద కేంద్రానికి తరలించి మరీ తగలబెట్టేస్తున్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలపై పంచాయతీ అధికారికి ఎంతటి చిత్తశుద్ధి ఉందో దీన్నిబట్టి అర్థమవుతుందని పలువురు గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెత్తను తగలబెట్టేస్తున్న పంచాయతీ అధికారిపై చర్యలు తీసుకోవాలని, గ్రామానికి ఆదాయం సమకూర్చే విధంగా సంపదను తయారుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై ఎంపిడిఒ ఆనందబాబుని వివరణ కోరగా సంపదకు ఉపయోగపడాల్సిన చెత్తను సంపద కేంద్రం వద్దే తగలబెడుతున్నారన్న విషయం తన దృష్టికి రాలేదన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

పోలీసుల సంక్షేమానికి కృషి

జిల్లా ఎస్‌పి భాస్కర్‌రావు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసుల సంక్షేమం కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తానని జిల్లా అదనపు ఎస్‌పి ఎంజెవి.భాస్కరరావు అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో పునర్విభజన అనంతరం ఏలూరు జిల్లాకు మొదటి అదనపు ఎస్‌పిగా ఆయన బాధ్యతలు చేపట్టారు.

ముగిసిన ఎపిఇఎపిసెట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎపి ఇఎపి సెట్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఈ నెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఇంజనీరింగ్ విద్యార్థులకు 22, 23 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు జరిగాయి. ఏడు రోజులపాటు జరిగిన ఈ పరీక్షలకు మొత్తం 6028 మందికి 5829 మంది హాజరు కాగా 199 మంది గైర్హాజరయ్యారు. మంగళవారం నిర్వహించిన చివరి పరీక్షకు ఏలూరులోని మూడు కేంద్రాలైన వట్లూరులోని సిఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, సిద్ధార్థ క్వెస్ట్, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలల్లో రెండు షిఫ్ట్‌లలో నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 940 మందికి 907 మంది హాజరయ్యారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన మొదటి షిఫ్ట్‌లో సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో 181 మందికి 167 మంది, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో 139 మందికి 134 మంది, సిఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 150 మందికి 148 మంది హాజరయ్యారు. మొత్తం ఉదయం షిఫ్ట్‌లో 470 మందికి 449 మంది, మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఆరు గంటల వరకు జరిగిన షిఫ్ట్‌లో సిద్ధార్థ క్వెస్ట్‌లో 181 మందికి 176 మంది, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో 139 మందికి 134 మంది, సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 150 మందికి 148 మంది హాజరయ్యారు.

ఆగిరిపల్లి ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం మంగళవారం ఏర్పాటైంది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా అస్సానుబాదు చంద్రశేఖర్, ఎస్ఎస్.బాబు(షేక్ వల్లి), గౌరవ అధ్యక్షులుగా బజాజ్ జాన్, ఉపాధ్యక్షులుగా సంగా శ్రీనివాసరావు, కార్యదర్శిగా నంజం రామకృష్ణతో పాటు మరో ఆరుగురు సభ్యులతో నూతన కార్యవర్గం ఏర్పాటైంది. పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ప్రెస్‌క్లబ్ పాటుపడుతుందని నూతన కార్యవర్గం తెలిపింది.

145వ రోజుకు గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకుంటున్న ప్రతి కుటుంబం సంతృప్తి వ్యక్తం చేస్తుందని చింతలపూడి ఎంఎల్ఎ విఆర్.ఎలీజా అన్నారు. మంగళవారం గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమం 145వ రోజు పట్టణ ఏడో వార్డులో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎలీజాకు వార్డు కౌన్సిలర్ దిరిసిపాము ధనలక్ష్మి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎంఎల్ఎ, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందజేస్తున్నామన్నారు. అధికారులు స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్, పట్టణ వైసిపి అధ్యక్షులు పిపిఎన్.చంద్రరావు, వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వందనపు సాయిబాలపద్మ, సచివాలయ కన్వీనర్ చనమాల శ్రీను, వాలంటీర్లు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఉంగుటూరు

తిమ్మయ్యపాలెం పొలాల్లోని మట్టిని జెసిబితో తవ్వి అక్రమంగా తరలిస్తున్నప్పటికీ సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని అధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా జెసిబితో మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలించి అమ్మేస్తున్నారు. పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అలాగే శ్మశాన భూమిలో మట్టిగొడ్డు వేసి మట్టిని తరలిస్తున్నారు. దీనిపై స్పందించిన సచివాలయ కార్యదర్శి జాషువ మాట్లాడుతూ మట్టిని తరలిస్తున్న వ్యక్తికి నోటీసులు ఇస్తామని తెలిపారు. పొలాల్లో మట్టి తవ్వకానికి ఎలాంటి అనుమతులు లేవని వారిపై చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

శతాధిక వృద్ధురాలు మంగళవారం మృతి చెందింది. మండలంలోని గురజ గ్రామానికి చెందిన పి.కృష్ణమూర్తి భార్య శకుంతల (103) వయోభారంతో మృతి చెందారు. 1920 జనవరిలో ఆమె జన్మించారు.

విద్యారంగ సమస్యలపై మాణిక్యరావు పోరాటం మరువలేనిది

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మాణిక్యరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రముఖులు, విద్యార్థులు

రిటైర్డ్ కళాశాల టీచర్స్ అసోసియేషన్ ఏలూరు యూనిట్ ఆధ్వర్యంలో విద్యావేత్త, పోరాటయోధుడు, మాజీ ఎంఎల్‌సి కీర్తిశేషులు ఎంఆర్.మాణిక్యరావు 97వ జయంతిని మంగళవారం ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ ఎస్.యుగంధర్ రవి అధ్యక్షతన స్థానిక కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ ఐటిఐలో నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్.వెంకటేశ్వరావు మాట్లాడుతూ మాణిక్యరావు జీవితం తెరిచిన పుస్తకమని, విద్యారంగంలో ఎయిడెడ్ వ్యవస్థ పాత్ర పెరగాలని, పనిచేసే అధ్యాపకుల విద్యాభివృద్ధి కృషికి వారి ఆర్థిక ప్రయోజనాలు అభివృద్ధికి, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అభ్యసించటానికి మాణిక్యరావు కృషి మరువలేనిదన్నారు. శాసనమండలి సభ్యులుగా విద్యారంగంలో ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారని చెప్పారు. జయంతిని పురస్కరించుకుని కళాశాల పేద విద్యార్థికి అవసరమైన రూ.పది వేలు ఎల్.వెంకటేశ్వరరావు సహకారంతో అందించారు. ఈ సందర్భంగా నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ కొండా రవి మాట్లాడుతూ విద్యావ్యవస్థ పటిష్టానికి జీవితాంతం త్యాగం చేసిన మహనీయుడని, ఉపాధ్యాయ పోరాటాలకు మార్గనిర్దేశం చేసిన మార్గదర్శి మాణిక్యరావు అని కొనియాడారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల కోసం జీవిత చరమాంకంలో కూడా అలుపెరుగని పోరాటం సాగించిన పోరాట యోధుడు మాణిక్యరావు అని, నేడు ప్రభుత్వ విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలకు ఆనాడే తన పోరాటాల ద్వారా పరిష్కారమార్గాలు చూపిన ధీరోదాత్తుడు అని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.కిషోర్, సూపరింటెండెంట్ వై.సత్య బ్రహ్మం, సిబ్బంది ఇక్ల జగన్మోహనరావు, ఎ.అజయ్, టి.రవి కిషోర్ పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం : మేకా ప్రతాప్

ప్రజాశక్తి - ముసునూరు


ముసునూరులో వాలంటీర్లకు పురస్కారాలు అందిస్తున్న ఎంఎల్ఎ మేకా ప్రతాప్

వాలంటీర్లంతా జగనన్న సైనికులని, వారి సేవలు అభినందనీయమని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిడిఒ జి.రాణి ఆధ్వర్యంలో వాలంటీర్లకు పురస్కారాలు అందించారు. మండలంలోని 16 గ్రామాలకుగాను 283 మంది వాలంటీర్లకు సేవామిత్ర, ఇద్దరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవా రత్న అవార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, ఎంపిపి రావర్ల కృష్ణకుమారి, వైస్ఎంపిపి కోటగిరి రాజానాయన, వైస్ ఎంపిపి-2 పాముల గంగాధరరావు, సర్పంచులు పేరం కృష్ణ, చలసాని దామోదరరావు, రంగు ధనలక్ష్మి, గాంధీ, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, ఎంపిటిసీలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: రాష్ట్రవ్యాప్తంగా వాలంటీర్ల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల వద్దకు తీసుకువెళ్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని చింతలపూడి శాసన సభ్యులు విఆర్.ఎలీజా అన్నారు. మంగళవారం స్థానిక రాజారాణి కళ్యాణ మండపంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ఎలిజా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. వాలంటీర్ల ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులని అని అన్నారు. 2019 ఎన్నికలకు ముందు పాదయాత్ర చేసిన జగన్ ప్రజల కష్టాలు నేరుగా చూసి నవరత్నాల పథకాలకు రూపకల్పన చేశారని, వాటిని రాజకీయ పార్టీల నాయకులు, అధికారుల ప్రమేయం లేకుండా, ప్రజలకు నేరుగా అందాలనే ఉద్దేశంతోనే వాలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేశారని తెలిపారు. కరోనా కష్ట కాలంలో వాలంటీర్ల సేవలు అమూల్యమైనవన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో ఘనంగా సత్కరించి, సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్‌చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు (ఆంజి), వైస్ చైర్‌పర్సన్ కంచర్ల వాసవీరత్నం పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లలో సవరణలు చేయాలి

ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లలో సవరణలు చేయాలని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల బదిలీల జిఒ47లో సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు 5/8 సర్వీస్ పూర్తి కాకుండా ఉన్న ఉపాధ్యాయులను ఏ కారణంతోనైనా బదిలీలు చేయాల్సి వస్తే వారికి రేషనలైజేషన్ పాయింట్లు, పాత స్టేషన్ పాయింట్లు ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ దగ్గరలో ఉండి తప్పనిసరిగా బదిలీలకు గురయ్యే ఉపాధ్యాయులకు మూడేళ్ల మినహాయింపును వర్తింపజేయాలన్నారు. బదిలీల గడువు పెంపుదల చేయాలని, పాఠశాల విద్యాశాఖలో ఈ ఏడాది జనవరిలో ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టి కొంతమందికి ఎస్‌జిటిలకు ప్రమోషన్లు ఇచ్చి వారికి 2500 రూపాయలను మాత్రమే అలవెన్స్ ఇవ్వకుండా ఆ ప్రమోషన్లను రద్దుచేసి, మళ్లీ ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన ప్రమోషన్లు కొనసాగిస్తూ వారికి ఎఫ్ఆర్-22 బి ప్రకారం ప్రమోషన్ స్కేల్ పే ఫిక్సేషన్ చేసి, ప్రమోషన్ తేదీ నుండి సీనియారిటీని పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

పాఠశాల విద్యాశాఖలో 02 విధానాన్ని ప్రవేశ పెట్టారని, ఇది హై స్కూల్లో పనిచేసేందుకు స్కూల్ అసిస్టెంట్‌కు మాత్రమే ఈ డిప్యూటేషన్ ప్రాతిపదికన కాకుండా, రెగ్యులర్ ప్రాతిపదికన పిజిటి ప్రమోషన్ ఇచ్చి ఎఫ్ఆర్ 22 బి ప్రకారం పే స్కేల్ ఫిక్సేషన్ చేయాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్లకు గతంలో మాదిరిగానే జూనియర్ లెక్చరర్ ప్రమోషన్లు కల్పించాలన్నారు.

వీలునామా పోయినది

తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం మండలం, బొమ్మూరు గ్రామ కాపురస్తులైన కొత్తపల్లి సత్య రవికాంత్, తండ్రి: (లేట్) సూర్యనారాయణమూర్తి తెలియపరుచునది ఏమనగా, నేను బొమ్మూరు గ్రామము నుండి ది. 12-05-2023వ తేదీన పశ్చిమగోదావరి జిల్లా, పెంటపాడు మండలం, ఆకుతీగపాడు గ్రామమునకు బైకుపై వెళ్లుచూ నా పంట భూమికి సంబంధించిన రిజిష్టర్డ్ ఒరిజినల్ వీలునామా నెం. 28/2018 గల వీలునామాను పెంటపాడులో జిరాక్స్ తీయించి బైక్ బ్యాగ్‌లో పెట్టి ఆకుతీగపాడు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో ఒరిజినల్ వీలునామా మరియు కొన్ని జిరాక్స్ కాపీలు పడిపోయినవి. కావున పైన తెలిపిన వీలునామా ఎవరికైనా దొరికినా ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

కొత్తపల్లి సత్య రవికాంత్
ఫోన్ నెంబర్: 7793955609

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి (PSCJ), ఏలూరు
ఇ.పి. నెం. 64/2020
ఒ.యస్. నెం. 174/2017

బిట్వీన్:
పెద్ది సునీత -పిటీషనర్/ డిక్రీ హోల్డర్
చల్లా శేషుకుమారి -రెస్పాండెంట్/ జడ్జిమెంట్ డెటార్

డిక్రీ హోల్డర్ దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల ఇ.పి వారంటు గ్రంథములో శ్రీ కోర్టు వారు ఈ దిగువ షెడ్యూలు ఆస్తుల బహిరంగ వేలమును ది. 14-06-2023వ తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు వేలం వేయుదురు. ఆసక్తి ఉన్నవారు సదరు వేలంలో పాల్గొనవచ్చును. పూర్తి వివరములకు డిక్రీ హోల్డర్ ప్లీడరు గారిని సంప్రదించగలరు.

షెడ్యూలు

ఏలూరు జిల్లా, ఏలూరు సబ్ రిజిష్ట్రీ ఇలాకా, ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్, గాంధీనగర్, ఇ-వార్డు, టి.ఎస్. నం. 100/26, 102-6-0 చ॥గజల స్థలం (తూర్పు వైపు) వాసవాని వీధి, ఆర్.ఆర్.పేట, డివిజన్ నెం.37, డో.నెం. 20బి-12-20, 21 డబుల్ పోర్షన్ ఆర్.సి.సి. బిల్డింగ్‌కు హద్దులు.
తూర్పు: విగ్నేశ్ రాముల గారి స్థలము.
దక్షిణం: మునిసిపల్ రోడ్డు.
పడమర: ఈ ఆస్తి మరియు గుడిపూడి శైలకుమారి గార్ల సహభద్ర ఉమ్మడి గోడ.
ఉత్తరం: దాసరి వెంకటలక్ష్మి గారి స్థలము.

పై హద్దుల మధ్య గల వాటా 102-6-0 చ॥గ॥లు తూర్పు వైపు స్థలం (అనగా 202-6-0 చ॥గ॥ల స్థలములో సగ భాగము) అందలి ఆర్.సి.సి. బిల్డింగ్‌తో సహా.
డిక్రీ హోల్డర్ విలువ: రూ. 20,00,000/-
అమీనా విలువ: రూ. 30,00,000/-

ఏలూరు
13-5-2023

కొటారి క్రిష్ణ కిషోర్
అడ్వకేట్, ఏలూరు
సెల్: 9948438590

In the Court of the Additional Senior Civil Judge, Eluru
O.S. No. 449/2016

Between:
M/s. Ushabala Chits Pvt. Limited, Ameerpet, Hyderabad, Rep. by its Legal Assistant, B.Dasaratha ...Plaintiff

AND

Buragadda Venkata Subba Rao & Others ...Defendants

D-5: Smt. Buragadda Subba Rajya Lakshmi, W/o. Buragadda Venkata Subba Rao, Hindu, Female, aged 85 years, Door No. 22A-2-5, Kesari Talkies, Opp. BSNL Office, Powerpet, Eluru.
D-8: Sri Buragadda Krishna Mohan, S/o. (late) Buragadda Venkata Subba Rao, Hindu, Male, aged 48 years, Door No. 22A-2-5, Kesari Talkies, Opp. BSNL Office, Powerpet, Eluru.

పైన ఉదహరించిన చిట్‌ఫండ్ కంపెనీ వారు చిట్ బాకీ రాబట్టుకునే నిమిత్తము దాఖలు చేసిన పై నెంబరు గల దావా గ్రంథములో శ్రీ కోర్టు వారు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియచేయునది ఏమనగా పై నెంబరు దావా (గ్రంథము) ది. 14-6-2023వ తేదీకి వాయిదా ఉన్నందున మీరు ఆరోజు అనగా ది. 14-6-2023వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట మీరు గాని, లేదా మీ అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీ వాదనలు ఏమైనా ఉన్న యెడల దాఖలు చేసుకోగలరు. అట్లు మీరు హాజరు కాని యెడల కోర్టు వారు పై నెంబరు దావా (గ్రంథము) మీ పరోక్షమున తీర్మానింపబడునని యుండుటయేగాక తెలియచేయడమైనది.

(మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఉత్తర్వుల ప్రకారము ఈ ప్రకటన ప్రచురించడమైనది)

ఏలూరు
ది. 23-5-2023

D.KRISHNA SASTRY
Advocate, Eluru

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS AT KHAMMAM
DISPUTE NO. 129 OF 2018

M/s.Kapil Chits (Kosta) Private Limited, H.No. 15-169, 1st Floor, NVR Complex, Near Bus Stand, Sathupally, Khammam District, Represented by its Branch Manager Cum Foreman, ...DISPUTANT

VERSUS

Mr. Sayed Nagoor, & 2 Others

To

Opponent No.1. Sayed Nagoor, S/o. Mastan, Age: 25 years, Occ: Car Driver, R/o. H.No. 4-11, Lalitha Kumari Hospital Road, Sathupally Mandal, Khammam District.
Opponent No.2. Banavathu Mahesh Babu, S/o. Babu Rao, Age: 25 years, Occ: Police Constable-2005, T.Narsapuram Police Station, Chinthalapudi Mandal, R/o. H.No. 7-121, T.Narsapuram Police Station, Chinthalapudi Mandal, West Godavari District. ......OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 47,801=00 against you and others and where as the above Arbitration/ Dispute is posted to 06-06-2023 for your appearance.

Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/Arbitrator, Khammam on the above said date at 11:30 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits, Khammam.

ప్రకటన

మహారాజశ్రీ భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, ప॥గో॥జిల్లా
M.V.O.P. No. 6/2022

బిట్వీన్:
పున్నాని గాంధి -పిటీషనర్
అండ్
ఉడేశి బాలనాగ వెంకట ఆది సాయికుమార్ & Others -రెస్పాండెంట్లు

టు:
R-2: కండిబోయిన రామచంద్ర, S/o. రామకృష్ణ, R/o. 19-25-1/2, 26th Ward, రెడ్డి కాలని, భీమవరం-1, ప॥గో॥జిల్లా.
ఓనర్ ఆఫ్ TATA ACE No: AP 37 TJ 0353 (as per C-Book)
R-3: బొబ్బనపల్లి సోలమాన్, S/o. పోలురాజు, R/o. 9-4-10, బ్రిడ్జి పేట, గునుపూడి, భీమవరం టౌన్, ప॥గో॥జిల్లా.
ఓనర్ ఆఫ్ TATA ACE No: AP 37 TJ 0353 (as per Policy)

మీరు పై తెలిపిన ఎం.వి.ఓ.పి. నెం. 6/2022లో పై తెలిపిన 2 & 3వ ప్రతివాది అయినందున, మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పై తెలిపిన 3వ భీమవరం అదనపు జిల్లా వారి కోర్టు వారి యొక్క ఉత్తర్వు ప్రకారం మీరు జూన్ నెల 9వ తేదీ 2023వ సం॥రం ఉదయం 10.30 ని॥లకు హాజరు కావలెను. లేని ఎడల సదరు దావాను మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయు దురని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది: 09-06-2023

నిమ్మల వీరవెంకట సత్యనారాయణ
సెల్: 9848213165
నిమ్మల నవీన్, సెల్: 8978122722
అడ్వకేట్స్, భీమవరం